# అడల్ట్స్ ఓన్లీ కథ



# ఎదురుచూసే మనసు లేక...

**పి.వి.డి.ఎస్.ప్రకాష్**

''చివరిగా ఒక్క ప్రశ్న.. టాలీవుడ్‌లో మీరు రైజింగ్ స్టార్. యూత్‌ఫుల్ క్రేజ్. థియేటర్లలో మీ చిత్రం విడుదలైతే చాలు, జాతరే. ప్రత్యేకించి, మహిళా ప్రేక్షకుల ఫాలోయింగ్ అత్యధికంగా ఉంది. అలాంటి మీరు పెళ్ళెందుకు చేసుకోలేదు? మీ డ్రీంగాళ్ ఇంకా దొరకలేదనుకోవచ్చా?''

ఫిల్మ్ జర్నలిస్ట్ అడిగిన ప్రశ్న గుర్తొస్తోంది సమీర్‌కి. ఉదయమెప్పుడో జరిగిన ఇంటర్వ్యూలో ప్రశ్న అది. అర్ధరాత్రి గడిచినా, ఇంకా వెంటాడుతూనే ఉంది. అప్పటికప్పుడు సమాధానమేదో ఇచ్చినట్లనిపించినా, ఆ జవాబు సరి కాదని భాషరాని మనసొకపక్క మూలుగుతూనే ఉంది.

అందుకే, జర్నలిస్ట్‌లు కలుసుకునేందుకొస్తే ఏదోలా ముఖం చాటు చేసుకునేందుకే ఇష్టపడతాడు సమీర్.

ఫిల్మ్ జర్నలిస్ట్‌ల్లో కూడా ఓ తరహా వ్యక్తులుంటారు. కాస్త చనువిస్తే, తరతరాల పుట్టుపూర్వోత్తరాలను శోధించి బహిర్గతపరచాలనే ఆసక్తి ఇలాంటివారిలో కాస్త ఎక్కువే. ఇండస్ట్రీ ఉన్న భాగ్యనగరంలోనైతే, తరచూ కన్పించే ముఖాలు కాబట్టి, మనస్తత్వాలు గ్రహించి మసలుకోవచ్చు.

ఔట్‌డోర్ షూటింగ్‌లోనే ఈ ఇబ్బంది.


ఎదుటపడి జర్నలిస్ట్‌నంటే మాట్లాడితే ఒక తంటా, మాటాడకుంటే మరో తంటా.

అక్కడికీ పర్సనల్ సెక్రటరీ ద్వారా కొంత కట్టడి చేసాడు సమీర్. అయినా, పట్టువదలని విక్రమార్కుడిలా 'ఇంటర్వ్యూహం'లో బంధించేసాడా జర్నలిస్ట్.

ప్రొఫెషనల్‌గా క్వశ్చన్స్ సంధిస్తే ఫర్వాలేదు. చుట్టూ తిరిగి 'పెళ్ళి-పెళ్ళాం' అంటేనే వస్తుంది చిక్కు.

''ఇంకా పెళ్ళెందుకు చేసుకోలేదు?'' అన్న ప్రశ్నకు షార్ప్‌గా రియాక్టయి- ''ఏం, నువ్వేమైనా పెళ్ళిళ్ళ బ్రోకరువా? నాకో సంబంధం చూస్తావా? ఇదిగో, నా బయోడేటా'' అంటే ఎదురయ్యే పర్యవసానం ఏంటో తెలుసు.

'అందుకే, ముందుగానే పర్సనల్ విషయాలు ఎవాయిడ్ చేద్దామనే షరతుతోనే ఇంటర్వ్యూ ఇచ్చేందుకంగీకరించినా-నెమ్మదిగా సంభాషణను ఆ దిశగా అత్యంత చాకచక్యంగా వ్యవహరించాడా జర్నలిస్ట్' అనుకున్నాడు సమీర్.



అతడికిచ్చిన సమాధానం తలుచుకుంటే సమీర్‌కే నవ్వొస్తోంది.

''నటుడిగా ఇంకా అనుకున్న లక్ష్యాలను చేరుకోలేదు. అంతేకాదు ఆర్థిక సుస్థిరతతోపాటు అన్ని రకాల సౌకర్యాలు సమకూరిన తర్వాతనే జీవితంలోకి ఓ స్త్రీని శ్రీమతిగా ఆహ్వానించడం.''

ఆ జవాబు సరికాదని సమీర్‌కీ తెలుసు.

యువనటుడిగా వరుస విజయాలు ఖాతాలో జమకూరాయి. ఫిల్మ్‌నగర్‌లో అత్యాధునికంగా వెలసిన తన ఇంటి చుట్టూ ఆలయ ప్రదక్షిణాలకన్నా అధికంగానే నిర్మాతలు ప్రదక్షిణాలు చేస్తున్నారు. ఎంత అడిగితే అంత అడ్వాన్స్‌ల రూపంలో చెల్లించేందుకు

ముందుకు వస్తున్నారు. ఇక, ఇల్లు కాదది. ఆధునిక జీవనశైలికి అద్దం పడుతూ విరాజిల్లే ఇంద్ర భవనం. అలనాటి 'మయసభ'ని తలపించేవిధంగా హృద్యంగా ఉంటుందది. ఆ ఇంటికి తొలిసారి వచ్చిన ప్రతి ఒక్కరూ ప్రశంసించడానికి భాషను సైతం విస్మరిస్తారు.

బాంక్ బాలెన్స్ సంగతా?

నాల్గైదు ప్రముఖ బాంకుల్లో లెక్కకు మించి ధనరాశులు మూలుగుతున్నాయి.

మరి పెళ్ళెందుకు చేసుకోలేదు?

సమీర్ కళ్ళ ముందు 'కాట్‌వాక్' చేస్తున్న వెండితెర సౌందర్యాలెన్నో మత్తుగా, గమ్మత్తుగా 'హలో' చెబుతున్నాయి. పబ్లిక్ హోర్డింగ్‌ల్లో పల్చటి తెల్లచీరలో తడిసిన అందాలతో వెర్రెక్కించే 'తెరనాయిక' చెవిలో గుసగుసపోతున్న అనుభూతి. మూడు కౌగిళ్లు, ఆరు యుగళగీతాలతో రొమాంటిక్‌గా సాగిపోతున్న ప్రస్తుత తరుణంలో 'మూడు ముళ్ల బంధం' పెద్ద డిస్టర్బెన్స్. అందుకే, పెళ్ళిని నిరవధికంగా వాయిదా వేస్తూ వస్తున్నాడు సమీర్. అంతే!

ఉడా పార్కులో ఆరోజు షూటింగ్. హీరోయిన్‌తో టీజింగ్ సాంగ్ పిక్చరైజేషన్. యూనిట్ సభ్యులు ఏర్పాట్లలో తలమునకలవుతున్నారు. ముంబాయి ముద్దుగుమ్మ ఎర్రెర్రని పెదాలకు లిప్‌స్టిక్ పూత పూస్తూ వయ్యారాలొలకబోస్తోంది. ఆమె ఏమాత్రం కందిపోకుండా ఉండేందుకు అసిస్టెంట్ నీడకోసం గొడుగును పడుతుంటే, మరో అసిస్టెంట్ ముఖారవిందం చూసుకునేందుకు వీలుగా అద్దాన్ని అందిస్తోంది. యూనిట్ సభ్యులంతా 'సదా మీ సేవలో' అన్నట్లు వ్యవహరిస్తుంటే, ఆ సేవలను అనుగ్రహంతో పరిగ్రహిస్తూనే ఓరకంటితో చిలిపిచూపులను హీరో సమీర్ వైపు సంధిస్తోందామె. అలవోకగా ఆ చూపుల అర్థాన్ని అంచనా వేస్తూ చుట్టూ ఓసారి చూసాడతడు.

షూటింగ్ హడావుడిని కుతూహలంగా తిలకించేందుకు విచ్చేసిన గుంపు సందడిగా దడి కట్టిందక్కడ. ఆ గుంపు వంక ఓసారి తేరిపారా చూసిన సమీర్ షాక్ అయ్యాడో క్షణం. ఆ గుంపులో ఒక అమ్మాయి అందానికి నిర్వచనంలా ఉంది.

అల్లసాని పెద్దన్న ప్రబంధంలో నుంచి పరారైన కావ్యనాయికలా, రామప్పగుడిలో నుంచి తప్పించుకున్న శిల్పకళా వైభవంలా తోచిందతడికి. 'తరుణి సొగసంటే ఇదే' అన్నంత హుందాగా నిలుచుందామె. ఒక్కసారి తనతో నటిస్తున్న హీరోయిన్ వంక చూసాడు సమీర్. దట్టంగా పూసుకున్న మేకప్ అందమే తప్ప సహజ సౌందర్యం ఏ కోశానా కన్పించలేదామెలో. కాస్మోపాలిటన్ సిటీల్లో పెరిగిన జాణతనం అది. 'ఫ్రీ' స్టయిల్‌కి అలవాటు పడి, 'కాట్‌వాక్'లో



మెళకువలు నేర్చుకుని, సిన్మాల్లో రాణించాలనే చాకచక్యాన్ని అలవర్చుకున్న 'ఆధునికత' కన్పిస్తోందామెలో. అందుకే, ఆమె 'సెల్యూలాయిడ్ కథానాయిక'గా అవకాశాలను తేలిగ్గానే సొంతం చేసుకుంది. ఆ గుంపులోని కావ్యనాయిక మాత్రం సూర్యుడు చూడని స్నిగ్ధ సౌందర్యంతో మెస్మరైజ్ చేసేస్తోంది.

ఎవరేమనుకుంటారోననే సిగ్గు, బిడియాలను పక్కకుపెట్టి అమెనలాగే చూస్తున్నాడు సమీర్. ఆ 'అనామిక' పక్కనున్న స్నేహితురాలితో ఏవో కబుర్లు చెబుతోంది. చిర్నవ్వులు చిందిస్తూ ఆమె మాటాడుతుంటే అరుణాధరాలు సడిసేయని రసగీతాలాలపిస్తున్నట్లనిపిస్తోంది సమీర్‌కి. తల ఊపుతుంటే నెమ్మదిగా కదులుతున్న ఆమె జూకాలు ఏవో సరసలోకాల దారి చూపిస్తున్న ఫీలింగ్. కాటుకలద్దిన కనె్రప్పలు టపటపలాడిస్తుంటే, తుమ్మెదలు రెక్కలు సవరించుకున్నట్టు తోస్తోందతడికి.

''ఇంతకీ హీరో ఏడే?'' ఆమె స్నేహితురాలి ప్రశ్న-

కావ్యనాయిక అటు ఇటు చూసింది.

తర్వాత సమీర్ వంక చూపెట్టింది. హీరో తననే చూస్తున్నట్లు గమనించి కాబోలు, సిగ్గుల మొగ్గే అయింది.

నెమ్మదిగా పలకరించేందుకు లేచాడు సమీర్. అంతలోనే, చిత్ర నిర్మాత ఆ గుంపు దగ్గరికి వెళ్ళాడు. కొద్దిసేపు తర్వాత సమీర్‌ని పిలిచాడు. ఆమెనింకా దగ్గరగా చూడొచ్చని, వీలైతే పరిచయం చేసుకోవచ్చని భావించి ఆత్రుతగా అక్కడికి చేరుకున్నాడు సమీర్.

## ఎంత అందం

**అటు బాలీవుడ్ అయినా, టాలీవుడ్ అయినా తారల అందమే ప్రధానం. సీన్స్ ఎలా ఉన్నా తారలు తమ అందాల్ని ఆరబోస్తే కాసుల వర్షం కురుస్తుందని భావిస్తారు దర్శక నిర్మాతలు. ఇప్పుడలాగే ఉంది పరిస్థితి. నరసింహుడు చిత్రం హీరోయిన్ సమీరారెడ్డి బట్టల విషయంలో చాలా పొదుపు పాటిస్తోంది. తన అందాన్ని ప్రతిబింబించే డ్రెస్ డిజైన్ల పట్ల ఈ భామ తెగ ఇంట్రెస్ట్ చూపిస్తోంది. ఇందుకోసం రాఖీ ఎస్ అనే స్టార్ డిజైనర్‌ని కూడా ఆమె నియమించుకుంది. ఎప్పటికప్పుడు లేటెస్ట్ వెరైటీ డ్రెస్‌లు ఆమె శరీరాన్ని తాకుతున్నాయి.**

అప్పటికే ఆ గుంపుతో సుదీర్ఘ చర్చలో మునిగితేలుతున్న నిర్మాత, సమీర్‌ని ఆత్మీయంగా హత్తుకుని వారికి పరిచయం చేసాడు. యువహీరోని అంత దగ్గరగా చూడడంలోని ఆనందాన్ని ఆపుకోలేనివారంతా 'ఆటోగ్రాఫ్'లంటూ చుట్టుముట్టేయగా, ఆమె మాత్రం సందడికి అల్లంత దూరాన నిలుచుంది. ఆమెనే ఓరకంట గమనిస్తున్న సమీర్ యధాలాపంగా ముచ్చటిస్తున్నాడు. ఇంతలో, నిర్మాత- ''ఈ అమ్మాయెంత బాగుందో- తర్వాత పిక్చర్‌లో ఈమెనే మన కథానాయిక.. ఏమంటారు?'' అన్నాడు.

సమీర్ ఒక్కసారిగా ఇబ్బందిపడ్డాడు. అంతలోనే తేరుకుని ఏమాత్రం తడుముకోకుండా- ''అబ్బే! ఫొటోజెనిక్ కాదండీ'' అనేసాడు.

చిత్రాల్లో నటించే అభిలాషున్నా, లేకున్నా ముఖం మీదే సమీర్ వ్యక్తం చేసిన అభిప్రాయానికి కించిత్ నొచ్చుకుంది. వెంటనే చికాకు వ్యక్తం చేస్తూ దూరంగా తప్పుకుంది. అది గమనించిన సమీర్ మనసులోనే బాధపడ్డాడు.

'అమృతవర్షిణి'లా వెన్నెల కురుస్తున్న వేళలో, తెల్లచీర కట్టుకుని సిగలో తెల్లని మల్లెల విరులు పెట్టు

కుని, కలహంసలా కదిలివస్తున్న ఆమెని చూస్తుంటే కాలమే తెలియకుంది సమీర్‌కి. ఆ రాత్రంతా ఆ 'అనామిక' కలలో రావడంతో కలత నిదురే శరణ్యమైందతడికి. 'స్త్రీ' అంటే ఏమిటో తెలియనంత అమాయకుడు కాడతడు. అందాలార బోసే గ్లామర్ ఫీల్డ్‌లో ఉన్నందున అవాంఛనీయంగానే చుట్టూ చేరి ప్రదక్షిణాలు చేసి కవ్వించి, కౌగిలించే ఆడవారెందరో అతడికి తెలుసు. శరీరం జ్వలిస్తే 'ఉప శమనం' ఎలాగో తెలుసు. కానీ, ఆ సుందరి మనసుకి చెమటలు పట్టించింది. తలుచుకుంటున్నకొద్దీ ఆశ్చర్యం కలుగుతోంది.

మర్నాడు, చిత్ర నిర్మాత ముందు తన మనసులో మాటను చెప్పేశాడు. ముందుగా ఒక్క క్షణం నివ్వెర పోయిన నిర్మాత, ముందురోజు తీసుకున్న ఆమె ఫ్రెండ్ చిరునామా అందించాడు. అది తీసుకున్న తర్వాత సమీర్ మనసు తేలికపడినట్లనిపించినా, మరో కొత్త సంశయం మొలకెత్తింది.

ఆమెకు తన 'ప్రేమ' ప్రపోజల్ తెలిపేదెట్లా? అంగీకరిస్తుందా? సినిమాల్లో ఇలాటి సన్నివేశాలను ఎంతో సులువుగా నెట్టుకొచ్చే తనకు నిజజీవితంలో మనసులో మాటను వ్యక్తం చేయడం ఇంత కష్టమా? గుండె ఊసులను చెప్పేందుకు ఒక్క 'గ్రీటింగ్ కార్డ్' చాలదేమో-

నచ్చిన మనిషి ముందు చిన్ని మనసుని ఆవిష్కరించడం ఇంత కష్టంతో కూడుకున్నదా? జీవితంలో అతి ముఖ్యమైన, బరువైన ఈ సన్నివేశాలను సినీ దర్శక, రచయితలు ఎంత ఈజీగా తెరకెక్కిస్తారో కదా! మొట్టమొదటిసారిగా తన 'ఈస్ట్‌మన్ కలర్' ప్రపంచం పట్ల చికాకు వేసింది సమీర్‌కి.

గంట తర్వాత సమీర్ కొత్త లొకేషన్‌కి చేరుకున్నాడు. అక్కడ యూనిట్ సభ్యుల హడావుడి లేదు. 'లైట్సాన్, కెమెరా స్టార్ట్' అన్న కేకలు అసలు లేవు. సమీర్ చెప్పేందుకు డైలాగ్ వెర్షన్ అందించే అసిస్టెంట్‌ల గోల లేదు. చిన్న గది. ఆ గదిలో ఎదురెదురుగా కేవలం ఇద్దరే.

''చెప్పండి'' ఆమె- అనామిక.

హీరోగారి నోట పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. ఆమె మళ్ళీ మళ్ళీ అడిగిందా ప్రశ్నని. తడుముకుంటూ చెప్పాడు సమీర్ మనసులో మాట- 'తనంటే ఇష్టమ'ని.

ఈసారి నోట మాట రాకపోవడం ఆమె వంతయింది. సమీర్ చిత్రాలెన్నో లోగడ తను చూసింది. అతడి నటనంటే ఇష్టం కూడా. నటించిన పలు చిత్రాల్లో ప్రేమించిన ప్రేయసి కోసం ఎంతకైనా తెగించగలిగే పాత్రలతో ఆకట్టుకున్నాడు సమీర్. అయితే, ఈ సన్నివేశాన్ని జీవితంలో తాను ఎదుర్కొంటుందని కలలో కూడా ఊహించలేదు. అందుకే, కాస్త ఇబ్బందిగా ఉందామెకు.

''పేరు'' సమీర్ ప్రశ్న.

''వినూత్న'' అనామిక జవాబు. అంతలోనే ఆమె పెదవులపై విరబూసింది చిన్ని నవ్వు.

ప్రశ్నార్థకంగా చూసాడు సమీర్, ఆమె వంక.

''పేరైనా తెలీని నాతో ప్రేమేమిటని....నవ్వొచ్చింది''

సమీర్ కూడా నవ్వేసాడు. తర్వాత అన్నాడు. ''అదే ప్రేమ'' అని.

''నీకు నచ్చానా?''

''ఫొటోజెనిక్ కాదు కదా!''

''మనసు తెరపై చూడు తెలుస్తుంది. నువ్వెంత 'ఫొటోజెనిక్కో' ఈ బ్యూటీని స్క్రీన్ బ్యూటీగా చూడాలనుకోలేదు. అందుకే.. అలా చెప్పాను.''

''మా నాన్నగారి నడగండి''

వారం రోజుల తర్వాత-

భాగ్యనగరంలోని ఓ స్టార్ హోటల్లో వైభవంగా రిసెప్షన్ ఇచ్చాడు సమీర్. ఆ సందర్భంగా మాటాడుతూ ''ఔట్‌డోర్ షూటింగ్‌కి వెళ్ళినప్పుడల్లా, ఇష్టమైనవాటిని తీసుకురావడం నాకు ఆనవాయితీ అని మీకంతా తెలుసు. ఈసారి ఆ ఆనవాయితీ తప్పలేదు. నా మనసుని దోచిన అపరంజిని అర్ధాంగిగా చేసుకున్నాను'' అన్నాడు.

వినూత్న అతడి జీవితంలోకి ప్రవేశించిన దగ్గర్నుంచి లైఫ్ స్టయిల్ మారిపోయింది. సినీ ప్రొఫెషన్‌ని కూడా క్రమపద్ధతిలోకి తీసుకొచ్చాడు. టెన్ టూ ఫైవ్ డ్యూటీ మాదిరిగానే వృత్తి జీవితాన్ని మలచుకున్నాడు. ఆదివారం సంపూర్ణంగా సెలవు ప్రకటించుకున్నాడు.

శ్రీమతితో జీవితం పంచుకోవడంలోని మాధుర్యాన్ని ప్రతిక్షణం సొంతం చేసుకుంటున్నాడు. 'స్త్రీ' అంటే ఇప్పుడే తెలుస్తున్న ఫీలింగ్.

'కార్యేషు దాసి, కరణేషు మంత్రి, భోజ్యేషు మాతా, శయనేషు రంభ'లా వివిధ రూపాలలో అండగా నిలిచే భార్యంటే ఒక్క ప్రేమేకాదు, భక్తి కూడా ఏర్పడ్డాయి సమీర్‌కి.

''హలో, సమీర్! బొత్తిగా నల్లపూసలా మారిపోయావు'' ఓ చిత్ర నాయిక ఫోన్‌లో హస్కీ వాయిస్‌తో పలకరించింది.

తన తర్వాతి చిత్రంలో నటించేందుకుగానూ ఈమధ్య తరచూ డిస్టర్బ్ చేస్తోందామె. ఒక్క ఆమె మాత్రమే కాదు, చాలామంది ఈ తరహా ఫోన్‌లతో విసిగిస్తున్నారు సమీర్‌ని. గతంలో అయితే, ఎవరినీ నొప్పించేవాడు కాడు సమీర్. ఈమధ్యనే అతడిలో ఈ మార్పు వచ్చింది. కారణం- వినూత్న.

అదే సంగతి చెప్పాడు సమీర్ ఆమెకి.

ఇన్నాళ్ళూ కాగితంపూల చుట్టే తిరిగి, అదే 'రస జగమని' భావించాడు. ఆలోచిస్తుండగా, వెనుక నుంచి వచ్చిన వినూత్న గట్టిగా కౌగిలించుకుంది. అంతేనా! నల్లటి కురులతో ముఖం కప్పేసింది. ఎవరన్నారు? పగటివేళ రాతిరి రాదని.. ఆమె వేడి శ్వాసల తమకంలో కాగిపోతూ, నెమ్మదిగా ఆమె చెవిలో గుసగుసగా అన్నాడు.

''ఎదురు చూసే మనసు లేక ఎంత వెలితో? ఎదను మీటే మనిషి రాక ఎంత కొరతో? ఇంతకాలం, ఎన్ని వెన్నెల జాగారాలు అడవి కాచాయో? ఇప్పుడు ఎన్ని మల్లెల సౌరభాలు శిరసు వంచాయో?''

''అబ్బాయిగారికి కవిత్వమొస్తోందే'' అంటూనే కౌగిలిని మరింత బిగించేసింది వినూత్న.

☆

## సుగంధాల షారూక్!

**ఎప్పుడూ సినిమా షూటింగ్స్ అంటే బోర్‌గానే ఉంటుంది. అటు సినిమాలు, ఇటు కంపెనీ యాడ్స్‌తో బిజీగా ఉన్నాడు షారూక్‌ఖాన్. ఈమధ్యే ఓ విదేశీ పెర్ఫ్యూమ్స్ కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా ఒప్పందం కుదుర్చుకున్న ఎస్సార్కె ఇప్పుడు ఆ ఉత్పత్తుల గురించి ప్రచారం చేస్తున్నాడు. టైగర్ ఐస్ అనే ఈ పెర్ఫ్యూమ్స్‌కి అప్పుడే అమ్మకాలు బాగా పెరిగాయని సర్వేలు చెబుతున్నాయి. ఆయన సినిమాల్లాగే ఈ పెర్ఫ్యూమ్స్ కూడా బాగా అమ్ముడౌతాయేమో చూడాలి మరి!**

